రాజన్న ఆలయ అర్చకుడికి 'ఉగాది' పురస్కారం

ప్రిన్సిపల్ సెక్రటరీ చేతుల మీదుగా ఉగాది పురస్కారాన్ని అందుకుంటున్న ఉప ప్రధానార్చకుడు వెంకన్న

వేములవాడ టౌన్, మార్చి 30 : విశ్వావసు నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీమతి శైలజ రామయ్యార్, కమిషనర్ శ్రీధర్ చేతులమీదుగా వేములవాడ రాజన్న ఆలయంలో విధులు నిర్వర్తిస్తున్న వేదపారాయణదారు జగన్మోహన్ ఉపాధ్యాయ, ఆలయ ఉపప్రధానార్చకులు కట్కూరి వెంకన్న రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. వీరికి అరుదైన పురస్కారం లభించడంపై వేములవాడ రాజన్న ఆలయ అర్చకులు, అధికారులు, బంధుమిత్రులు, వివిధ పార్టీల నాయకులు ఇద్దరిని అభినందించారు.

పేదలకు రంజాన్ కిట్ల పంపిణీ

నిత్యావసర కిట్లు అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు, మత పెద్దలు

గంభీరావుపేట, మార్చి 30: మండల కేంద్రంలోని వంద పేద ముస్లింలకు ఆదివారం సిద్దిపేట ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర కిట్లు అందించారు. రంజాన్ పండుగను ప్రతి ఒక్కరూ ఘనంగా జరుపుకోవాలన్న ఉద్దేశ్యంతో 15 సంవత్సరాలుగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర కిట్లు అందిస్తున్నామని తెలిపారు. ఫౌండేషన్ చైర్మన్ సాదత్ నజీర్‌కు గంభీరావుపేట మసీదు కమిటీ తరపున ధన్యవాదాలు తెలిపారు. ఇక్కడ మసీదు కమిటీ అధ్యక్షుడు మహబూబ్‌అలీ, మత పెద్దలు అస్లాం, జుబేర్, హమీద్, సయ్యద్ ఆసీఫ్ అలీ, నుసురత్, వాసిమ్, ముస్తాఫా, ఫౌండేషన్ సభ్యులున్నారు.

సంఘాల నూతన కార్యవర్గాల ఎన్నిక

రుద్రంగి శ్రీ రాజరాజేశ్వర మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

రుద్రంగి, మార్చి 30: మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర, శ్రీలక్ష్మీ నరసింహస్వామి మున్నూరు కాపు సంఘాల నూతన కార్యవర్గాలను ఆదివారం సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీ రాజరాజేశ్వర సంఘం అధ్యక్షుడిగా మీసాల మల్లేశం, సభ్యులుగా నంద్యాడపు తిరుపతి, నంద్యాడపు సాయిరెడ్డి, నంద్యాడపు అంజయ్య, ఆకుల నర్సయ్యను ఎన్నుకున్నారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి సంఘం అధ్యక్షుడిగా ఇప్ప మహేశ్, ప్రధాన కార్యదర్శిగా చెలుకల తిరుపతి, గౌరవాధ్యక్షుడిగా ఎర్రం నర్సయ్య, సభ్యులుగా సాన వెంకట్‌రెడ్డి, ఎర్రం రాజన్నలను ఎన్నుకున్నామని సంఘ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా సంఘాల అధ్యక్షులు మాట్లాడుతూ, మున్నూరు కాపు సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఇఫ్తార్ విందు

ఇఫ్తార్ విందులో రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ

గంభీరావుపేట, మార్చి 30: మండల కేంద్రంలోని మసీదులో ముస్లింలకు ఆదివారం రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ ఇఫ్తార్ విందు ఇచ్చారు. స్వగ్రామమైన గంభీరావుపేటలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ ఇఫ్తార్ విందులో పాల్గొనడంపై ముస్లింలు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ముస్లింలు జుబేర్, సాదత్, మహబూబ్‌అలీ, హమీద్, ఆసిఫ్ అలీ, నుసురత్, వహీద్, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాల పునాదులపై కాంగ్రెస్ పాలన

- స్థానిక నేతలు ప్రజలను తప్పదోవ పట్టిస్తున్నారు
- కేటీఆర్ నిధులు ఇస్తే కాంగ్రెస్ రిటర్న్ తీసుకున్నది
- బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి

సిరిసిల్ల టౌన్, మార్చి 30: అబద్ధాల పునాదులపై కాంగ్రెస్ ప్రభుత్వ పాలన కొనసాగుతున్నదని బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి విమర్శించారు. ఈ మేరకు ఆదివారం సిరిసిల్లలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత మున్సిపల్ పాలకవర్గంలో అక్రమాలు జరిగాయంటూ కాంగ్రెస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేసిన ఆరోపణలపై తాము పూర్తి స్పష్టతనిచ్చామని తెలిపారు. మరోసారి కాంగ్రెస్ నేతలు అవే ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. టెండర్ లేకుండా బిల్లులు తీసుకున్నారని, సీసీరోడ్డు వేయకుండానే బిల్లులు పొందారని నిరాధారమైన ఆరోపణలు చేశారని అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అబద్ధాలతో పాలన అందిస్తుంటే స్థానిక నాయకులు ఆయన బాటలోనే ప్రజలను మభ్యపెడుతున్నారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం అప్పటి మంత్రి కేటీఆర్ సహకారంతో రూ.55కోట్ల నిధులతో టెండర్ చేశారని, మీకు చేతనైతే సదరు టెండర్ పూర్తి చేసి పట్టణంలో అభివృద్ధి పనులు చేసి చూపించాలని డిమాండ్ చేశారు. అనవసరమైన మాటలు మానుకోపోతే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. శవాలపై పైసలు ఏరుకునే కొంత మంది నాయకులు చేసిన ఫిర్యాదుతో అంత్యక్రియల నిర్వహణకు సంబంధించిన కార్మికుల వేతనాలు నాలుగు నెలలుగా నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.101తో అంత్యక్రియలు నిర్వహిస్తూ తాము తీసుకున్న నిర్ణయాన్ని సైతం తప్పుపట్టడం విడ్డూరంగా ఉందన్నారు. వేతనాలు రాని కార్మికులు రోడ్డెక్కితే కాంగ్రెస్ నాయకులే బాధ్యులు అవుతారన్నారు. మున్సిపాలిటీలో లేబర్‌ల నియామకంలో అక్రమాలు జరిగాయని చెప్పిన వ్యక్తి తాను స్వయంగా టెండర్ నిర్వహించినప్పుడు రూ.5వేలు మాత్రమే వేతనాలు ఇచ్చాడన్నారు. తమ పాలనలో అవినీతికి తావులేకుండా కార్మికుడి బ్యాంకు ఖాతాలో నేరుగా వేతనాలు అందించామన్నారు. కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలో అవినీతికి తావులేకుండా అభివృద్ధి లక్ష్యంగా తమ పాలకవర్గం పని చేసిందన్నారు. మీరు చేసిన ఆరోపణలు రుజువు చేస్తే తాము ఎక్కడికైనా రావడానికి సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. మున్సిపల్ జనరల్ ఫండ్‌పై చేసిన ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. అవగాహన లేని ఆరోపణలు పునరావృతమైతే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు లింగంపల్లి సత్యనారాయణ, కల్లూరి రాజు మాట్లాడుతూ, గత పాలకవర్గంలో భాగస్వాములుగా ఉన్న నాయకులే పాలకవర్గంలో అవినీతి జరిగిందంటూ ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. అధికార పార్టీలో ఉన్న నాయకులు ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వంలో ఉన్న మీరు చేసిన ఆరోపణలపై విచారణ జరిపించి రుజువు చేయాలని డిమాండ్ చేశారు. ఏడాదిన్నర పాలనలో తట్టెడు మట్టి పోసిన పాపాన పోలేదన్నారు. అభివృద్ధి చేసి ప్రజల మనసు గెలుచుకోవాలి కానీ, తప్పుడు ఆరోపణలు చేసి మున్సిపాలిటీని అభాసుపాలు చేయొద్దని సూచించారు. కాంగ్రెస్ నేతలు ఇప్పటికైనా నిరాధారమైన ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు దార్ల సందీప్, అన్నారం శ్రీనివాస్, గడ్డం భాస్కర్, మ్యాన రవి, ఒగ్గు రాజేశం, సత్తార్, ఎరవెల్లి వెంకటరమణా రావు, సబ్బని హరీశ్, రిక్కు మల్లె సంపత్, బండారి శ్యాం, ప్రభుదాస్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంబురంగా ఉగాది



వేములవాడ టౌన్ : పంచాంగ శ్రవణం చేస్తున్న అర్చకులు

సిరిసిల్ల టౌన్/కోనరావుపేట/రుద్రంగి/ఇల్లంతకుంట/గంభీరావుపేట/చందుర్తి/ముస్తాబాద్/బోయినపల్లి రూరల్, మార్చి 30 : జిల్లా వ్యాప్తంగా నూతన విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాలలో ఉదయాన్నే ఇంటిని శుభ్రం చేసుకుని మామిడి తోరణాలతో అలకరించారు. నూతన వస్త్రాలు ధరించి ఆలయల్లో పూజలు చేశారు. ఇంట్లో కుటుంబ సమేతంగా పిండి పదార్థాలు, పచ్చడినుతయారు చేసి ఆరంగించారు. ఆలయాల్లో వేదపండితులు పంచాంగ శ్రావణం నిర్వహించగా ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు. సిరిసిల్ల పట్టణంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ ఆలయంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో పద్మ పురోహితులు పంచాంగాన్ని చదివి వినిపించారు. కార్యక్రమంలో పద్మ పురోహిత సంఘం అధ్యక్షుడు కోడూరి విజయ్‌భాస్కరశర్మ, గౌరవాధ్యక్షుడు కోట లక్ష్మీనర్సయ్య, పద్మశాలీ అనుబంధ సంఘాల నాయకులు, కట్టెకోల లక్ష్మీనారాయణ, గూడూరి ప్రవీణ్, జిందం చక్రపాణి, గుండ్లపల్లి శ్రీనివాస్, గుండ్లపల్లి పూర్ణచందర్, ఆడెపు రవీందర్, కాముని వనిత పాల్గొన్నారు. అలాగే, జిల్లా కేంద్రంలోని శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలో చిన్మయ బాలమిషన్ సత్సంగ్, చిన్మయ బాలవిహార్ సంయుక్తంగా బాల కవి సమ్మేళనం నిర్వహించారు. చిన్నారులు కవితలు చదివి వినిపించారు.

విశ్వావసులో అంతా శుభమే..

వేములవాడ టౌన్, మార్చి 30 : విశ్వావసు నామ సంవత్సరంలో అంతా శుభమే జరుగుతుందని, దేశం సుభిక్షంగా ఉంటుందని రాజన్న ఆలయ ప్రధానార్చకుడు, ప్రముఖ జ్యోతిష్య పండితులు చంద్రగిరి శరత్ అన్నారు. విశ్వావసు నామ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయ ఓపెన్ స్లాబ్ వేదికపై ఆదివారం సాయంత్రం పంచాంగ పూజ ఘనంగా నిర్వహించారు. అనంతరం పంచాంగ శ్రవణ కార్యక్రమం జరిగింది. ఈ సంవత్సరం వర్షాలు బాగా కురుస్తాయని, నవ నాయకుల్లో శుభగ్రహాలు ఎక్కువగా ఉన్నాయని, పశు సంరక్షణలో బలరాముడు ఉన్నాడు కావునా పాడి పంటలు బాగా ఉంటాయని తెలిపారు. ఉగాది సందర్భంగా వేద మూర్తులైన బ్రాహ్మణులు, విశ్రాంత అర్చకులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శాలువాతో సత్కరించి, స్వామివారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

వేములవాడ టౌన్ : ఆలయ ప్రధానార్చకుడు సురేశ్‌ను సన్మానిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సిరిసిల్ల టౌన్ : సిరిసిల్లలోని మార్కండేయ దేవస్థానంలో పంచాంగ శ్రవణం వింటున్న స్థానిక నాయకులు

సదరముంది.. పెన్షన్ ఇప్పించండి

- ప్రభుత్వానికి తల్లిదండ్రుల వేడుకోలు

బొప్పాపూర్‌లో అంధుడైన కొడుకును చూపుతున్న గంగాధర్-లావణ్య

ఎల్లారెడ్డిపేట, మార్చి 30: పేదరికాన్ని ఎదుర్కొంటున్న తమకు అంధుడైన కుమారుడున్నాడని, అతనికి సదరం సర్టిఫికెట్ కూడా ఉందని అయినప్పటికీ పెన్షన్ మంజూరు కాలేదని, పెన్షన్ ఇప్పించాలని బొప్పాపూర్‌కు చెందిన పోచంపల్లి గంగాధర్-లావణ్య దంపతులు ప్రభుత్వాన్ని వేడుకున్నారు. వివరాల్లోకి వెళితే, బొప్పాపూర్‌కు చెందిన పోచంపల్లి గంగాధర్-లావణ్య దంపతుల కుమారుడు యశ్వంత్(6) పుట్టుకతోనే అంధత్వంతో బాధపడుతున్నాడు. చికిత్స కోసం హాస్పిటల్లలో రూ.లక్షలు ఖర్చు చేసినా చూపు తిరిగి రాలేదని ఆవేదనగా తెలిపారు. దీంతో అంధత్వ ధ్రువీకరణ కోసం 2022లో సదరం సర్టిఫికెట్ తీసుకున్నామన్నారు. ఆ సర్టిఫికెట్‌తో పెన్షన్ కోసం ఆఫీసుల చుట్టూ తిరిగినా రాలేదని తెలిపారు. ఇప్పటికైనా తమ కుమారుడికి పెన్షన్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లంతకుంట, మార్చి 30 : మండలంలోని తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ ఫిర్యాదుతో రాత్రి సమయంలో ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండగా మండలంలోని తాళ్లపల్లి గ్రామ శివారులో పెట్రోలింగ్ పోలీస్ సిబ్బంది ఆదివారం పట్టుకున్నారని ఎస్ఐ కదిరె శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. మండలంలోని కేశన్నపల్లి గ్రామానికి చెందిన వడిజె అభిల్ (27) అనుమతి లేకుండా ట్రాక్టర్ ద్వారా ఇసుక రవాణా చేస్తుండగా పట్టుకుని ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేశామని తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక రవాణ చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. అభిల్‌ను రిమాండ్‌కు తరలించామని ఆయన పేర్కొన్నారు.

వేములవాడలో ఐఎంఏ క్రికెట్ పోటీలు

వేములవాడ, మార్చి 30 : జిల్లా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైద్యుల ఆధ్వర్యంలో వేములవాడలో సోమవారం నుంచి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ నాగమల్ల శ్రీనివాస్, డాక్టర్ చీకోటి సంతోష్ కుమార్ ఆదివారం తెలిపారు. వైద్యులు, పోలీసులు, జర్నలిస్టులు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, లయన్స్ క్లబ్ సభ్యులతో కలిసి జట్లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఏప్రిల్ 6వ తేదీ వరకు రాజన్న ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

కుక్కల దాడిలో వృదుడికి గాయాలు

ముస్తాబాద్, మార్చి 30 : మండలంలోని పోతుగల్ గ్రామ వంజరి చిన్నాజి అనే వృద్ధుడిని దారిలో నడుస్తూ వెళ్తుండగా కుక్కలు దాడిచేసి చేయికి తీవ్ర గాయాలు చేసినట్లు ఆయన కొడుకు రాజు తెలిపాడు. ఇరవై రోజుల క్రితం కూడా ఇదే స్థలంలో చిన్నాజికి కుక్కలు కాలుకు తీవ్రగాయాలు చేసినట్లు రాజు తెలిపాడు. దారిపై చిన్నారులు, వృద్ధులు వెళ్లేందుకు భయపడుతున్నారని, కుక్కల నుంచి రక్షణ కల్పించాలని స్థానికులు అధికారులను వేడుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట, మార్చి 30: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. నారాయణపూర్‌కు చెందిన అవీష్, అఫ్రోజ్ స్కూటీపై సిరిసిల్లకు షాపింగ్ చేసేందుకు బయలుదేరారు. అదే సమయంలో వెంకటాపూర్ నుంచి వస్తున్న ఓ ఆటో స్కూటీని ఢీకొట్టగా అవీష్, అఫ్రోజ్‌లు తీవ్రగాయాల పాలై అపస్మారక స్థితిలో పడిపోయారు. వారి వెనుకే వస్తున్న మిత్రులు గాయాలపాలైన వారిద్దరిని చూసి లేపేందుకు ప్రయత్నించినా స్పందన లేదు. దీంతో వెంటనే ఇద్దరిని ఓ ప్రైవేటు వాహనంలో ఎల్లారెడ్డిపేటలోని అశ్వినీ హాస్పిటల్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. ఆటోలో ఉన్న ఎల్లేశ్, జంపయ్య, రఘుపతి, గురవయ్యకు సైతం గాయాలకు కాగా వారిని 108లో చికిత్స నిమిత్తం సిరిసిల్లకు తరలించారు.

ఫైర్‌లైన్స్‌కు నిధులేవి..? అడవికి రక్షణేది?

- నిధుల్లేక నిలిచిన కార్యక్రమం
- చేష్టలుడిగి చూస్తున్న అధికారులు
- ఇదే అదనుగా కబ్జాదారుల కుటిలయత్నం
- పశువుల కాపరుల, ఆకతాయి చేష్టలకు ఆహుతి

గుండారంలో బుగ్గిపాలైన అడవి(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, మార్చి 30: అడవి బతికితే భావితరాలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తు దొరుకుతుందని గత ప్రభుత్వం చేసిన అనేక కార్యక్రమాలు గ్రీన్ కవరేజ్ పెరిగేందుకు దోహదపడింది. అడవిపై కత్తిగట్టే యత్నం చేసిన వారిపై కఠినంగా వ్యవహరించడంతో అడవి పదిలంగా ఉండేదని అటవీ గ్రామాల ప్రజలు అంటున్నారు. కొంత కాలంగా ఏదో ఓ చోట పచ్చని అడవిని బుగ్గిపాలు చేసి కబ్జా చేసేందుకు యత్నం చేస్తుండగా మరికొంతమంది సాధారణంగా చేసే పనులతో అడవి అంటుకుంటున్నదని అటవీగ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎండకాలం సమీపించేవేళ గతంలో అడవిలో ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేసి మంటలు విస్తరించకుండా ఏర్పాటు జరిగేది. ఈ ఏడాది ఫైర్‌లైన్స్‌కు నిధులు రాకపోవడంతో ఎక్కడపడితే అక్కడ మానవ ప్రయత్నమో, సహజ కారణమో మొత్తానికి పచ్చని అడవి ఎర్రటి మంటల్లో కాలిబూడిదై పోతున్నది. విలువైన అటవీ సంపదకు అపార నష్టం కలుగుతుండగా, జీవరాశుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్నది.

అటవీ విస్తీర్ణం.. మంటలార్పే యత్నం

జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ రేంజ్‌ల పరిధిలో 12 సెక్షన్‌లు, 44బీట్‌లలో కలిపి సుమారు 27వేల హెక్టార్లలో అటవీ విస్తీర్ణం ఉంది. జిల్లాను జగిత్యాల, కామారెడ్డి, నిజామాబాద్, సిద్దిపేటతో కలిపి అడవులు ఉన్నాయి. ఉన్న అడవుల్లో ఎక్కువ శాతం ఆకురాల్చే వృక్షాలే కావడంతో ఎండాకాలం అగ్నిప్రమాదాల ప్రమాదం పొంచి ఉంటుంది. దీంతో మంటలు వ్యాపించకుండా అడవిలో మీటరుకు రూ.6 చొప్పున ప్రతి వంద చదరపు మీటర్లకు ఒక ఫైర్‌లైన్ వేసి ఆ చదరపు లైన్ దాటకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. వీటితో పాటు చిన్న ప్రమాదాలు సంభవించినప్పుడు బ్లోయర్లతో మంటలార్పే ప్రయత్నం చేస్తారు.

అడవికి మంటలు.. కారణాలు

పశువుల కాపరులు తమ పశువులను మేతకు తీసుకెళ్లే క్రమంలో కొందరు బీడీలు తాగి ఎక్కడపడితే అక్కడ వేస్తుంటారు. ఈ క్రమంలో ఎండిన ఆకులు అంటుకొని మంటలు తీవ్రమై వనదహనం జరిగిన ఘటనలున్నాయని అధికారులు చెబుతున్నారు. కొందరు ఇప్పపూలు తీసేందుకు కొందరు చెట్టుకింద శుభ్రం చేసే క్రమంలో ఎండిన ఆకులను తీసి మంటపెట్టడం, తునికాకు తీసేందుకు వెళ్తున్న క్రమంలో బాగా రావడానికి మంటలు పెట్టడం, కొందరు ఆకతాయి యువకులు అడవిలో మద్యం తాగుతూ, సిగరెట్లు తాగి పడేసిన సందర్భంలో అడవులు అగ్నికి ఆహుతవుతూ ఉంటాయి. ఇక అన్నింటికంటే ప్రమాదకరమైన కారణం అడవిని కబ్జా చేయాలనే కుటిలయత్నాలు కూడా అక్కడక్కడా జరుగుతున్నట్లు పలు గ్రామాల ప్రజలు అనుకుంటున్నారు. ఇటీవల ఎల్లారెడ్డిపేట మండలం గుండారంలో ఏకంగా 55 హెక్టార్ల మేర అడవి అంటుకోవడం వెనుక కుట్ర ఉందని సదరు భూమిపై కొందరు కన్నేసిన క్రమంలోనే ఇది జరుగుతుందని అనుకుంటున్నారు. అలాగే కొందరు చెట్లను నరుకుతున్న క్రమంలో, పోడు భూమి ఉందని లేకున్నా వితండవాదం చేస్తున్న వారిని కట్టడి చేస్తున్నారనే కారణంతో అటవీశాఖ అధికారుల ఆత్మస్థైర్యం దెబ్బతినేలా కొందరు దుందుడుకు చర్యలకు దిగుతున్నారని అటవీ గ్రామాల ప్రజలు, పర్యావరణ ప్రేమికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

తూతూ మంత్రంగా చర్యలు

ఏటా ప్రభుత్వం వేసవి సమీపిస్తున్న తరుణంలో ఫైర్‌లైన్స్‌కు నిధులు కేటాయించేది. దీంతో వారు కూలీలను నియమించి అడవిలో మంటలు విస్తరించకుండా ప్రతి వంద చదరపు మీటర్లకు ఓ ఫైర్‌లైన్ ఏర్పాటు చేసేది. అడవిలో సహజ, మానవ చర్యలతో అడవులంటుకుంటే శాటిలైట్, అక్కడున్న మనుషుల ద్వారా సమాచారం అందుకుని మంటలార్పే యత్నం చేసేది. అప్పటికే ఉన్న ఫైర్‌లైన్స్‌తో మంటలు విస్తరించకుండా నియంత్రణ ఉండగా అటవీశాఖ అధికారులు అక్కడికి వెళ్లి అగ్ని ప్రమాదాలను కంట్రోల్ చేసేది. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం ఫైర్‌లైన్స్‌కు నిధులు కేటాయించకపోవడంతో అడవిలో పశువులు, గొర్రెల కాపరులు, అటవీ గ్రామాల ప్రజలకు వనదహనంపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఏదైనా కారణంతో అడవులంటుకుంటే అక్కడికి చేరేలోపు ఫైర్‌లైన్స్ లేని కారణంగా ఎక్కువభాగం అడవులకు నిప్పంటుకుంటుండగా అధికారులు చేష్టలుడి చూస్తున్నారు. చిన్నచిన్న ప్రమాదాలు సంభవించినప్పుడు బ్లోయర్లతో మంటలార్పుతున్నారు.

నిధుల్లేక ఫైర్‌లైన్స్ వేయలేదు

ఇప్పటి వరకైతే ఫారెస్ట్‌లో అగ్ని ప్రమాదాలు జరగకుండా ఫైర్‌లైన్స్ వేయలేదు. ఇంకా నిధులు రాకపోవడంతో ఏర్పాటు చేయలేదు. త్వరలోనే నిధులు వస్తాయని ఉన్నతాధికారులు చెపుతున్నారు. వచ్చిన వెంటనే ఫైర్‌లైన్స్ వేయిస్తాం. కావాలని కొంద రు అడవిని అంటిస్తున్నట్లు మాకు తెలియదు. గుండారంలో జరిగిన వన దహనంపై విచారణ చేస్తున్నాం. మానవ ప్రయత్నమని తేలితే చట్ట ప్రకారం ముందుకెళ్తాం. అడవిని కాపాడుకోవడం అందరి బాధ్యత. ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలు స్వచ్ఛందంగా స్పందించాలి. సమాచారం అందించాలి. వీలైతే మంటలార్పేందుకు తమవంతు సహకారం అందించాలి.

-శ్రీహరిప్రసాద్, ఎఫ్ఆర్‌వో(సిరిసిల్ల)

అల్మాస్‌పూర్‌లో అడవిలో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు (ఫైల్)

కంచర్లలో అంటుకుంటున్న మంటలు (ఫైల్)

కనగర్తి గ్రామంలో పంట పొలంలో గుంపులుగా తిరుగుతున్న కోతుల మంద

కోతుల కిష్కింధకాండ

- పంటలను నాశనం చేస్తున్న వానరాలు
- నష్టపోతున్న రైతులు



మామిడిపల్లిలో పొలం చుట్టూ ఏర్పాటు చేసిన వల

కోనరావుపేట, మార్చి 30: కోతుల బెడద రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. గుంపులు గుంపులుగా సంచరిస్తూ చేతికొచ్చిన పంటలను నాశనం చేస్తున్నాయి. ఓ వైపు భూగర్భ జలాలు అడుగంటిపోయి, బోర్లు ఎత్తిపోయి పొట్ట దశలో ఉన్న వరి పంటను ఎలా కాపాడుకోవాలని రైతులు మదనపడుతూంటే, ఇంకోవైపు కోతులు పదుల సంఖ్యలో పొట్ట దశలో ఉన్న వరి గింజలను కొరికేస్తూ, పంటను తొక్కేస్తున్నాయి. దీంతో రైతులు పొద్దంతా కోతుల కాపాలా ఉంటూ, పంట రక్షణ కోసం పడరానిపాట్లు పాడుతున్నారు. కోతుల నియంత్రణకు ప్రభుత్వం, ఇటు అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

కోతులతో కొండంత కష్టం

ఆరుగాలం శ్రమించి పంటలు పండించుకుంటున్న రైతులకు కోతులతో కష్టాలు తప్పడం లేదు. ఒక రకంగా మండల ప్రజలు, కోతుల మధ్య కొన్నేళ్లుగా ఒక యుద్ధమే జరుగుతోంది. ప్రధానంగా శివంగాళపల్లి, ఏగ్లాస్‌పూర్, వట్టిమల్ల, మామిడిపల్లి, మరిమడ్ల, కనగర్తి, మంగళ్లపల్లి గ్రామాలతోపాటు పలు గ్రామాల్లో కోతుల బెడద తీవ్రరూపం దాల్చింది. ఆయా గ్రామాల్లో సాగు చేసిన వరి, మొక్కజొన్న, కూరగాయాల వంటి పంటల్లో కోతులు చొరబడి నానా భీభత్సం సృష్టిస్తున్నాయి. గుంపులు గుంపులుగా సంచరిస్తూ పంటలను పాడు చేస్తున్నాయి. రైతులు పెద్ద కర్రలతో వాటిని తరిమే ప్రయత్నం చేసిన ఫలితం లేకుండా పోతుంది. దీంతో పంట చేతికొచ్చే స్థితిలో కోతులు దాడి చేస్తుండడంతో సరైన దిగుబడి రాక నష్టాలు మిగులుతున్నాయని రైతులు చెపుతున్నారు. రైతులు పంటల రక్షణకు పడరాని పాట్లు పడుతున్నారు. కోతులు పంట పొలాలకు రా కుండా చుట్టూ పాత చీరెలు, వలలు ఏర్పాటు చేస్తున్నారు. కొన్ని చోట్ల మైకులు, పెద్దగా శబ్దం వచ్చే గన్నులు వంటి వాటిని వినియోగిస్తున్నారు. కనగర్తి వంటి గ్రామాల్లో ఖర్చుతో కూడిన సోలార్ కంచెలు సైతం ఏర్పాటు చేశారు.

అధికారుల పట్టింపేది ?

మండలంలో చుట్టూ అటవీ విస్తీర్ణం అధికంగా ఉండడంతో ఇతర ప్రాంతాల నుంచి కోతులను వ్యాన్‌లలో పట్టుకువచ్చి రాత్రి పూట వదిలివెళ్తున్నారు. ఇలా ఊరుబయట రోడ్లపై వదలడంతో అవి మళ్లీ గ్రామాల్లో ప్రవేశించి ఇండ్లలో చొరబడుతున్నాయి. గ్రామస్తులు వాటిని వెంబడిస్తే తిరిగి చెట్ల పొదలు, గుట్టల్లో చేరి, ఆకలి సమయాల్లో పంట చేలల్లో చేరుతున్నాయి. ఇదంతా జరుగుతున్న కోతుల నియంత్రణ కోసం అధికారులు చర్యలు చేపట్టడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. కో తులను బంధించి, వాటి నియంత్రణ కోసం ప్రత్యేక నిధులు కేటాయించి కోతుల బారి నుంచి రక్షణ కల్పించాలని పలువురు డి మాండ్ చేస్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి కోతల సమస్య నుంచి విముక్తి కల్పించాలని రైతులు వేడుకుంటున్నారు.